# నమస్తే తెలంగాణ
# ఖమ్మం

5 | ఖమ్మం, సోమవారం 19 ఫిబ్రవరి 2024 | KHAMMAM




భద్రాచలం ఐటీడీఏ పాలక మండలి సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి

## గిరిజనుల అభ్యున్నతే రాష్ట్రప్రభుత్వ ధ్యేయం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క
- భద్రాచలంలో ఐటీడీఏ పాలకమండలి సమావేశం

భద్రాచలం, ఫిబ్రవరి 18: గిరిజనుల అభ్యున్నతే రాష్ట్రప్రభుత్వ ధ్యేయమని, అందుకు అనుగుణంగా ఐటీడీఏ యంత్రాంగం పని చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన ఐటీడీఏ పాలక మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో విద్యావ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. అందుకు గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యతోనే గిరిజనుల జీవన స్థితిగతులు మెరుగుపడతాయన్నారు. పదోతరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు వీలుగా వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఏజెన్సీ యువతకు ఉపాధి ఉద్యోగావకాశాలు అవకాశాలు కల్పించాలన్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. గిరిజన రైతులను ప్రోత్సహించేందుకు తగినన్ని నిధులు విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. మళ్లీ ఇందిర జలప్రభ పథకాన్ని అమలు చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. భద్రాచలంలో కరకట్ట నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గిరిజన యువత సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ పొందేందుకు సాయం అందిస్తామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించి, సంఘాలు బలోపేతం చేస్తామన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు 'న్యాక్' ద్వారా శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. భద్రాద్రి జిల్లాలో అభివృద్ధికి మరిన్ని నిధులు విడుదల చేస్తామన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న పోడు సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మారుమూల గిరిజన గూడేల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా కొండరెడ్లు నివసిస్తున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ట్రైకార్ ద్వారా గిరిజనులకు 80శాతం సబ్సిడీపై రుణాలు అందిస్తున్నామన్నారు. ఏజెన్సీలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతను గుర్తించి వారి కోసం ప్రత్యేక వృత్తి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత వారికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. గిరిజన రైతులకు వందశాతం రాయితీపై మోటరు, బోరు అందిస్తున్నామన్నారు. అర్హులైన రైతులందరికీ పోడు పట్టాలు అందించామన్నారు. మంత్రులు అనంతరం కొందరికి ట్రైకార్ రుణాలకు సంబంధించిన చెక్కులు పంపిణీ చేశారు. సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, పాయం వెంకటేశ్వర్లు, కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల, భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు, ఓఎస్డీ కృష్ణభాస్కర్, భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్ పాల్గొన్నారు.

### శ్రీరామనవమి కల్లా రెండో వంతెన పనులు పూర్తి చేయిస్తాం

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

భద్రాచలం, ఫిబ్రవరి 18: శ్రీరామనవమి కల్లా రెండో వంతెన పనులు పూర్తి చేయిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. భద్రాచలం ఐటీడీవో కార్యాలయంలో ఆదివారం పాలకమండలి సమావేశం పూర్తయిన తర్వాత నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో తమ ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి పనులు చేపడతుందన్నారు. పోడు భూముల సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. భద్రాద్రి రామయ్య ఆశీస్సులతో త్వరలో కరకట్ట పనులు పూర్తి చేస్తామన్నారు.

## మేడారం భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించండి

- అవసరమైతే ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేయాలి
- జాతర బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని



బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 18 : మేడారం జాతరకు వెళ్లే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించి ప్రభుత్వ రవాణా వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకాన్ని కలిగించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం బస్టాండ్ నుంచి మేడారం జాతరకు వెళ్లే ప్రత్యేక బస్సులను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం సేవా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ... జాతరకు 140 బస్సులు ఏర్పాటు చేసినప్పటికీ భక్తుల రద్దీ దృష్ట్యా ప్రైవేట్ బస్సులను సైతం అద్దె ప్రాతిపదికన నడిపించాలన్నారు. డిపో అధికారులు, సిబ్బంది వారంరోజులపాటు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. కొత్తగూడెం డిపో పరిధిలో 30 ఆర్టీసీ బస్సులు, 35 ప్రైవేట్ బస్సులు సేవలందిస్తున్నాయని, వీటిసంఖ్యను పెంచేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు, రాంబాబు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సునీత, చంద్రగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## చెరువు మాధారంలో మూడోరోజూ నిలిచిన చేపల వేట

**మూడు రోజుల్లో ఐదు టన్నుల చేపలు మృతి**



చేపల వేటలో మత్స్యకారులు



కంటైనర్‌లోకి చేపలు వేస్తున్న జేసీబీ

కూసుమంచి (నేలకొండపల్లి), ఫిబ్రవరి 18: నేలకొండపల్లి మండలలం చెరువుమాధారంలోని చెరువులో చేపలు పట్టడం ఏటా ప్రహసనంగా మారుతున్నది. చెరువులో పట్టిన చేపలను గ్రామస్తులకు తక్కువ ధరకు ఇవ్వాలని కోరుతుండడం, చేపలు ఇవ్వకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహించి అమాంతం చేపలను ఎత్తుకెళ్లడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పోలీస్ పహారా ఉంటే తప్ప గ్రామస్తులను నిలువరించే పరిస్థితి లేకపోయింది. ఈసారి కూడా ''ఒక అడుగు ముందు పడితే నాలుగు అడుగులు వెనక్కి..'' అన్నట్లు చేపల వేట జరుగుతున్నది. శుక్ర, శని వారాల్లో మత్స్యకారులు చేపలు పట్టేందుకు యత్నించగా గ్రామస్తులు అక్కడికి వచ్చి వేటను అడ్డుకున్నారు. గ్రామస్తులకు తక్కువ ధరలో చేపలు ఇచ్చే విషయంలో మత్స్యకారులు, కాంట్రాక్టర్ల మధ్య విభేదాలు రావడంతోనే ఈ పరిస్థితి. కాంట్రాక్టర్లు ఆదివారం తెల్లవారుజామున ఏకంగా పెద్ద క్రేన్‌ను చెరువు వద్దకు తీసుకొచ్చారు. మత్స్యకారులు తెప్పలపై నుంచి చేపలు పట్టగానే జేసీబీ సాయంతో చేపలను సరాసరి కంటెయినర్‌లోకి వేసే విధంగా ఏర్పాట్లు చేశారు. గ్రామస్తులు దీంతో ఆగ్రహానికి గురై చేపల వేటను అడ్డుకునేందుకు యత్నించారు. ఒక దశలో ఉద్రిక్తత ఏర్పడి చెరువు పరిసర ప్రాంతమంతా బురదమయమైంది. బురదలో పడి మూడు రోజుల్లో సుమారు 5 టన్నుల చేపలు మృతిచెంది విక్రయానికి పనిరాకుండా పోయాయి. ఏదేమైనా సోమవారం తెల్లవారుజాము నుంచి తిరిగి చేపల వేట కొనసాగిస్తామని మత్స్యకారులు తెలిపారు.

## ఒలంపియాడ్ స్టేట్ టాపర్‌గా రెజోనెన్స్ విద్యార్థిని



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్ శ్రీధర్‌రావు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 18 : నగరంలోని రెజోనెన్స్ శ్రీనగర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని కే. గాయత్రి తన్విష మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచినట్లు పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, కష్టపడేతత్వం, ఆచరణ వంటి వాటితో గెలుపు సాధ్యమవుతుందన్నారు. పుస్తకాల్లో ఉన్న జ్ఞానాన్ని పొందుతూనే సామాజిక స్పృహతో మేధావులుగా తీర్చిదిద్దాబడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొండా కృష్ణవేణి, ప్రిన్సిపాల్ ప్రసన్నరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# మార్కెట్ టార్గెట్!

- వ్యవసాయ మార్కెట్లకు ఆదాయ లక్ష్యాన్ని విధించిన రాష్ట్ర మార్కెటింగ్ శాఖ
- నిరుడుతో పోల్చుకుంటే రూ.3 కోట్లు తగ్గిన ఆదాయం
- రాబోయే 40 రోజులు మార్కెట్లకు అత్యంత కీలకం
- మార్చి చివరి నాటికి దృష్టి సారిస్తే ఆశించిన ఆదాయం పొందే అవకాశం

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 18 : రాష్ట్ర మార్కెటింగ్ శాఖ వ్యవసాయ మార్కెట్లకు ఆదాయం సమకూర్చుకునే విషయంలో టార్గెట్ విధించింది. గత ఏడాదితో పోల్చుకుంటే.. ఈసారి మార్కెట్ల ఆదాయం భిన్నంగా కనిపిస్తుండడంతో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటాయా.. లేదా.. అనే సందేహం తలెత్తుతోంది. జిల్లా మార్కెటింగ్ శాఖ పరిధిలో ప్రస్తుతం ఖమ్మం మార్కెట్‌తోపాటు నేలకొండపల్లి, మద్దులపల్లి, సత్తుపల్లి, మధిర, వైరా, ఏన్కూర్, కల్లూరు వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. 2023-24 సంవత్సరానికి జిల్లా మార్కెటింగ్ శాఖకు.. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ రూ.54.39 కోట్ల ఆదాయం సాధించే విధంగా టార్గెట్‌ను విధించింది. యార్డులో జరిగే క్రయవిక్రయాలతోపాటు అనుబంధంగా ఉండే కూరగాయల మార్కెట్లు, చెక్‌పోస్టులు, జిన్నింగ్ మిల్లు, రైస్ మిల్లులు, కోల్డ్ స్టోరేజీలు తదితర వనరుల ద్వారా వ్యవసాయ మార్కెట్లు ఆదాయాన్ని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. గత ఏడాది జనవరి పూర్తయ్యే వరకు 8 మార్కెట్లు కలిపి రూ.44.39 కోట్ల ఆదాయం సమకూర్చుకున్నాయి. ఈ ఏడాది మార్కెటింగ్ శాఖ గణాంకాల ప్రకారం రూ.46.95 కోట్ల ఆదాయం సేకరించాయి. దీంతో గత ఏడాదితో పోల్చితే రూ.3 కోట్ల ఆదాయం తక్కువగా సమకూరింది. ఏటా మార్చి నుంచి తిరిగి మార్చి వరకు గడువు ఉండగా.. మార్కెటింగ్ శాఖ విధించిన టార్గెట్ చేరుకోవాలంటే మరో 40 రోజులు మాత్రమే సమయం ఉంది. ఈ ఏడాది వానకాలం సీజన్‌లో ప్రధాన పంటలైన పత్తి, వరి, మిర్చి సాగు ఎక్కువైంది. కొద్ది నెలలుగా వరి, పత్తి పంట మార్కెట్‌కు రావడం ప్రారంభమైంది. ఈ సంవత్సరం సీసీఐ కొనుగోళ్లు చేపట్టింది. అయితే ఆశించిన మేర పంట దిగుబడులు రాకపోవడంతో మార్కెట్ల ఆదాయంపై ప్రభావం కనిపిస్తోంది. ఖమ్మం మార్కెట్ లక్ష్యాన్ని ఛేదించాలంటే మిగిలిన గడవులోగా సుమారు రూ.10 కోట్లు సంపాదించుకోవాల్సి ఉంది. మార్కెట్ల పరిధిలో ప్రస్తుతం మిర్చి, పత్తి కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. మార్చి చివరి నాటికి మరింత దృష్టి సారిస్తే ఆయా మార్కెట్లు ఆశించిన ఆదాయం పొందే అవకాశం కనిపిస్తోంది.

### మరో 40 రోజులు అత్యంత కీలకం

జిల్లా మార్కెటింగ్ శాఖ పరిధిలో ఎనిమిది మార్కెట్లు ఉండగా.. వీటిలో ఖమ్మం, ఏన్కూర్ మార్కెట్లలో మాత్రమే నిరంతరాయంగా క్రయవిక్రయాలు జరుగుతాయి. మధిర, నేలకొండపల్లి మార్కెట్లలో సీజనల్‌గా కొనుగోళ్లు, అమ్మకాలు చేపడతారు. మిలిగిన మార్కెట్లు ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు, చెక్ పోస్టులు, జిన్నింగ్ మిల్లుల ద్వారా ఆదాయాన్ని రాబట్టుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ ఏడాది సీసీఐ జిన్నింగ్ మిల్లుల దగ్గర మాత్రమే పత్తి కొనుగోళ్లు చేపట్టింది. దీంతో ఆయా మార్కెట్లకు అదనపు ఆదాయం సమకూరనున్నది. గత ఏడాదితో పోల్చుకుంటే పత్తి పంటకు ప్రైవేటు కేంద్రంతోపాటు సీసీఐ సైతం మద్దతు ధర పెంచింది. మిర్చి పంటకు ప్రస్తుతం గరిష్ఠ ధర క్వింటాకు రూ.22వేల వరకు ఉంది. వీటిని సద్వినియోగం చేసుకొని, తద్వారా మార్కెట్ ఫీజు వసూళ్లపై మరింత దృష్టి సారిస్తేనే రెండు నెలల్లో టార్గెట్‌కు చేరుకునే అవకాశం కనిపిస్తోంది.

**నేటి వరకు మార్కెట్లు సాధించిన ఆదాయం ఇలా..(జనవరి నెలలోపు)**

| మార్కెట్ | 2023-24 లక్ష్యం | చేకూరిన ఆదాయం |
|---|---|---|
| ఖమ్మం | రూ.26.14 కోట్లు | రూ.18.90 కోట్లు |
| మధిర | రూ.3.75 కోట్లు | రూ.3.69 కోట్లు |
| నేలకొండపల్లి | రూ.4.05 కోట్లు | రూ.3.36 కోట్లు |
| కల్లూరు | రూ.4.17 కోట్లు | రూ.4.67 కోట్లు |
| వైరా | రూ.4.72 కోట్లు | రూ.5.38 కోట్లు |
| ఏన్కూర్ | రూ.4.14 కోట్లు | రూ.3.13 కోట్లు |
| సత్తుపల్లి | రూ.3.75 కోట్లు | రూ.4.17 కోట్లు |
| మద్దులపల్లి | రూ.3.08 కోట్లు | రూ.1.08 లక్షలు |

### లక్ష్యాన్ని ఛేదించే విధంగా చర్యలు

2023-24కి గాను వ్యవసాయ మార్కెట్లు టార్గెట్‌ను ఛేదించే విధంగా అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే పలుమార్లు కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించాం. ఆదాయ స్థితి, నిర్దేశించిన లక్ష్యాలపై దిశానిర్దేశం చేశాం. మార్చి చివరి నాటికి ప్రతి మార్కెట్ టార్గెట్‌ను అధిగమించే విధంగా కార్యాచరణ సిద్ధం చేశాం. చెక్‌పోస్టుల నిర్వహణపై దృష్టి పెట్టాం. సీసీఐ నుంచి మార్కెట్ ఫీజు రావాల్సి ఉంది. వానకాలం సీజన్‌కు సంబంధించి ఐకేపీ నుంచి ఆయా మార్కెట్లకు సెస్ రావాల్సి ఉంది.

**– ఎంఏ.అలీం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి**

## వారణాసీ పురపతిం భజ విశ్వనాథమ్ !



మాజీ ఎమ్మెల్యే సండ్రను అశీర్వదిస్తున్న అర్చకుడు



ధ్వజస్తంభ స్థాపనకు హాజరైన భక్తులు

- సత్తుపల్లికి ఆధ్యాత్మిక శోభ
- భక్తిశ్రద్ధలతో కాశీవిశ్వేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 18 : 'గంగా తరంగ రమణీయ జటా కలాపం.. గౌరీ నిరంతర విభూషిత వామ భాగం.. నారాయణ ప్రియమనంగ మదాపహారం.. వారాణసీ పురపతిం భజ విశ్వనాథమ్..' అనే కాశీ విశ్వేశ్వరుని స్తోత్రంతో సత్తుపల్లి పట్టణం ప్రతిధ్వనించింది. 'కాశీ విశ్వేశ్వరా.. శరణు.. శరణు..' అంటూ భక్తులు శివయ్యను కొలిచారు. మొత్తానికి గుడిపాడు రోడ్‌లోని దుర్గాపార్వతి సహిత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం, ధ్వజస్తంభ స్థాపన అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకలకు తుని తపోవన పీఠాధిపతి సచ్చితానంద సర్వసతిస్వామి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. స్వామికి ఎమ్మెల్యే మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ స్వాగతం పలికారు. వేదపండితులు హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వేడుకలను తిలకించేందుకు పట్టణంతోపాటు పలు గ్రామాల నుంచి భారీగా భక్తులకు విచ్చేశారు. మహిళా భక్తులు బోనాలు వండి స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించారు. వైదిక కార్యక్రమాలకు కొల్లి నాగేశ్వరరావు ఆర్థిక సాయం అందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు కొల్లి నర్సింహారావు, కొల్లి వెంకటేశ్వరరావు, నున్నా రత్నారావు చూసుకున్నారు.

## కొవ్వూరు రైల్వేలైన్ మంజూరు పట్ల హర్షం

**కృతజ్ఞతలు తెలిపిన పాండురంగాచార్యులు**



మాట్లాడుతున్న కొదమసింహం పాండురంగాచార్యులు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 18 : ప్రజల చిరకాల స్వప్నమైన భద్రాచలం రోడ్– కొవ్వూరు రైల్వేలైన్ మంజూరు ప్రజల పోరాటానికి దక్కిన ప్రతిఫలమని రైల్వేలైన్ సాధన కమిటీ కన్వీనర్ కొదమసింహం పాండురంగాచార్యులు అన్నారు. రైల్వేలైన్ మంజూరు పట్ల హర్షం వ్యక్తంచేస్తూ బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పనులు చేపట్టేందుకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీ, రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రైల్వేలైన్ కోసం వచ్చే ఏప్రిల్ ఒకటో తేదీన శంకుస్థాపన జరగనున్నది. ఈ రైలుమార్గం ద్వారా ఖమ్మం, కొత్తగూడెం, పశ్చిమగోదావరి జిల్లా గిరిజన ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. భద్రాచలం పుణ్యక్షేత్రానికి వచ్చే యాత్రికులకు కూడా సులభతరం అవుతుందన్నారు. సమావేశంలో బాలరాజు, సత్యనారాయణ, సలిగంటి శ్రీనివాస్, బానోత్ ధర్మ, గోపాలరావు, ఈశ్వరయ్య, హనుమంతరావు, పవన్‌కల్యాణ్, కల్లూరి కృష్ణ పాల్గొన్నారు.

## 'ఐటీడీఏ పాలకమండలి'లో భద్రాచలం ఎమ్మెల్యేకి అవమానం

- వేదికపైకి ఆహ్వానించని మంత్రులు
- తీవ్రంగా ఖండించిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షురాలు కుంజా రమాదేవి

భద్రాచలం, ఫిబ్రవరి 18 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని ఐటీడీఏలో ఆదివారం నిర్వహించిన పాలకమండలి సమావేశంలో స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును వేదికపైకి ఆహ్వానించకుండా అవమానించడం సరైనది పద్ధతి కాదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కుంఠ రమావేది అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఐటీడీఏ పీవో జిల్లా కలెక్టర్ ఈ సమావేశంలో పాల్గొన్నారని అన్నారు. పాలక మండలి సమావేశం గిరిజనుల సమస్యలపైన, ఈ ప్రాంత అభివృద్ధి కోసం ముందుగా ప్రణాళికలు రూపొందించడం కోసం జరుగుతున్న సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే వెంకట్రావ్‌ను ఆహ్వానించకుండా ప్రొటోకాల్ పాటించలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించే బాధ్యత ఎమ్మెల్యేకి ఉందని, కానీ సమస్యలను ప్రస్తావించడానికి అవకాశం ఇవ్వకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఒక సాధారణమైనటువంటి వ్యక్తిగా మిగిలిపోవాల్సి వచ్చిందని ఆదివాసీ ఎమ్మెల్యేకి ఇచ్చే గౌరవం ఇదేనా అని ఆమె ప్రశ్నించారు. కావాలనే కుట్రపూరితంగా తెల్లంను అవమానపర్చారని అన్నారు. ఆదివాసీ ఎమ్మెల్యే కావడంతోనే ఆయన్ను అగౌరవపర్చారని పాలక మండలి, బేషరతుగా ఆదివాసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకనైనా అధికారులు తీరు మార్చుకొని ఐటీడీఏ సమావేశాలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఆదివాసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యేను గౌరవించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఛత్తీస్‌గఢ్‌లో సీఏఎఫ్ కమాండర్ దారుణ హత్య

**దండకారణ్యంలో మావోయిస్టుల ఘాతుకం**



తిజౌరామ్ భూర్య (ఫైల్)

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 18: ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు ఓ కమాండర్ స్థాయి అధికారిని దారుణంగా హతమార్చారు. తెలిసిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ ఫోర్స్ (సీఏఎఫ్) 4వ బెటాలియన్ కమాండర్ తిజౌరామ్ భూర్య ఆదివారం బీజాపూర్ జిల్లా కుట్రు పోలీస్‌స్టేషన్ పరిధి అటవీప్రాంతంలోని సీఏఎఫ్ క్యాంప్‌నకు 200 మీటర్ల దూరంలో తన సిబ్బందితో కలిసి వంట చెరుకు సేకరిస్తున్నాడు. మావోయిస్టులు అప్పటికే సాయుధంగా వచ్చి కాపుగాసి కమాండర్ తిజౌరామ్ భూర్యను అపహరించారు. గొడ్డలితో దాడి చేసి హతమార్చి అక్కడి నుంచి ఉడాయించారు. జవాన్లు వెంటనే ఘటనా స్థలానికి వచ్చి రక్తపు మడుగులో ఉన్న భూర్యను విగత జీవిగా గుర్తించారు. భూర్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు. కమాండర్ హత్యను సీరియస్‌గా తీసుకున్న అక్కడి పోలీస్ ఉన్నతాధికారులు ఘటనా జరిగిన స్థలానికి భారీగా భద్రతా దళాలను పంపించారు. మావోయిస్టుల కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. హత్యకు గురైన కమాండర్ స్వగ్రామం నారాయణ్‌పూర్ జిల్లాలోని భానుప్రతాపపురం అని తెలుస్తున్నది. మరోవైపు ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్‌శర్మ పిలుపు మేరకు తాజాగా మావోయిస్టు పార్టీ దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ షరతులతో కూడిన చర్చలకు అంగీకరిస్తున్నట్లు లేఖ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇలాంటి సందర్భంలో మావోయిస్టులు ఓ కమాండర్‌ను పొట్టన పెట్టుకోవడం ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో వేచిచూడాల్సిందే.

## గుండె నిండా అభిమానం

**కేసీఆర్ చిత్రాన్ని పచ్చబొట్టు వేయించుకున్న రామకృష్ణ**



ఖమ్మం, ఫిబ్రవరి 18 : ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల పరిధిలోని బచ్చోడు గ్రామానికి చెందిన గుజ్జ నాగయ్య కుమారుడు గుజ్జ రామకృష్ణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై తనకున్న అభిమానాన్ని వినూత్న రీతిలో చాటిచెప్పాడు. కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ కోసం చేసిన కృషి, కేసీఆర్ పదేండ్లలో రాష్ట్రానికి చేసిన అభివృద్ధికి మంత్రముగ్ధుడై కేసీఆర్ 70వ పుట్టినరోజు సందర్భంగా కేసీఆర్ చిత్రపటాన్ని తన గుండెలపై పచ్చబొట్టు వేయించుకున్నాడు. కేటీఆర్, కేసీఆర్‌తో కలిసి ఫొటో దిగాలని పలుమార్లు ప్రయత్నం చేసినప్పటికీ ఫలించలేదని ఎలాగైనా వారిని కలిసి వారితో ఫొటో దిగుతానని ఆదివారం ఖమ్మం వచ్చిన రామకృష్ణ పేర్కొన్నాడు. తెలంగాణ భవనంలో ఓసారి ప్రయత్నించినా కుదరలేదని, ఇటీవల జరిగిన నల్గొండ సభలో ప్రయత్నించినా ఫొటో దిగడం కుదరలేదని ఆవేదన వ్యక్తంచేశాడు. జీవితంలో ఒకసారైనా కేసీఆర్, కేటీఆర్‌ను కలిసి వాళ్లతో ఫొటో దిగడమే తన కోరిక అని తెలిపారు. రామకృష్ణతోపాటు గుజ్జ సతీశ్, అనపర్తి కొండలు, గుజ్జ కొండలు ఉన్నారు.